క్లుప్తంగా

పాఠశాలకు ప్రింటర్ వితరణ

పెబ్బేరు రూరల్: మండలంలోని రాంపురం చెందిన నవీన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ సోమవారం ప్రాథమిక పాఠశాలకు కలర్ ప్రింటర్‌ను హెచ్‌ఎం రాఘవేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేశీ నర్సింహయాదవ్, ఆడేం బీచుపల్లి, బాలరాజు, గోవర్దన్‌రెడ్డి, జయరాములు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో అధ్యాపకురాలికి డాక్టరేట్



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఆర్.స్వాతి డాక్టరేట్ సాధించినట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ... రసాయన శాస్త్రంలో మైక్రోవేవ్ అసిస్టెంట్ సింథసిస్ అప్లికేషన్స్‌పై ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరిస్వామి ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు చెప్పారు. తన భర్త అధ్యాపకుడు భగవంత్‌రెడ్డి ప్రోత్సాహంతోనే డాక్టరేట్ పొందానని పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల, పామాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న 50మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు తెలంగాణ ఉద్యమకారుడు మహేష్ పరీక్షప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్, శేఖర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

భజన మండలికి అభినందనలు

పెబ్బేరు రూరల్: రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కాకునూరులో ఆదివారం జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో వనపర్తికి చెందిన ఉమామహేశ్వర భజన మండలి వారు పాల్గొని ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. నిర్వాహకులు వీరిని శాలువాతో సన్మానించి రూ.11,116 అందించారు. వీరిని వనపర్తి కవులు, కళాకారులు అభినందించారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, నాగేష్,యాదవ్, వెంకట్‌రాములు, చారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన



అమరచింత: పట్టణంలోని సిద్దార్థ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించినట్లు హెచ్‌ఎం సుమలత, కరస్పాండెంట్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయ పాత్ర పోషించి తమ తోటి విద్యార్థులకు చక్కగా బోధించడంపై అభినందించారు.


కుష్ఠ గుర్తింపుపై ఇంటింటి సర్వే

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు గ్రామాలల్లో కుష్ఠ వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించినట్లు పీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్ రామయ్య తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వ్యాధి మచ్చలు గల వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైద్య సిబ్బందికి సహకరించి వివరాలు అందించాలన్నారు. ఈ సర్వే ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారెడ్డిని కలిసిన నాయకులు

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని అమడబాకుల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా మండలంలోని కానాయపల్లికి చెందిన నాయకుడు రావుల సురేంద్రనాథ్‌రెడ్డి నివాసానికి రావడంతో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో బీసీరెడ్డి, రంగారెడ్డి, రామస్వామి, కొల్లంపల్లియాదవ్ తదితరులు ఉన్నారు.

కొత్వాల్‌కు అభినందనలు



వనపర్తిటౌన్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఒబేదుల్ల కొత్వాల్‌ను పట్టణానికి చెందిన ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అక్తర్, అనీస్, ఖాదర్‌ఖాన్ తదితరులు సోమవారం మహబూబ్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో సేవలందిస్తున్న కొత్వాల్‌కు ఇచ్చే గుర్తింపునకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. కార్పొరేషన్ తరుపున మైనార్టీలకు అందే రుణాలను చేరువ చేయడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి జాతర

- శివనామస్మరణతో పులకించిన ఆత్మకూర్
- స్వామివారికి ప్రత్యేక దాసంగాలు



రథంపై కొలువుదీరిన స్వామివారు...



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: పట్టణంలోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో పూజలు, రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాదిమంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారులు కర్పసయ్య ఆధ్వర్యంలో జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, కౌన్సిలర్లు చెన్నయ్య, మంద్లరామకృష్ణ, పోశన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సూం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకుని పట్టణంలోని పురవీధుల గుండా స్వామివారికి మేళతాళాలతో పల్లకీసేవ చేపట్టారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి పూజలు నిర్వహించారు. రాత్రి రథోత్సవంపై పరమేశ్వరస్వామి విగ్రహాలు ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. బుధ, గురువారం రాత్రి తేరు సందర్భంగా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



స్వామివారికి దాసంగాలు తయారు చేస్తున్న భక్తులు



పల్లకీసేవలో స్వామివారు

కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు సోమవారం ఉదయం అర్చకులు అగ్నిప్రతిష్ఠ, నిత్యహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గరుడ ధ్వజారోహణంలో సంతానప్రాప్తి కోసం 11 జంటలు పాల్గొన్నాయి. వైనతేయ (గరుడ)ను శాస్త్రోక్తంగా ఆహ్వానించి దంపతులతో సాంప్రదాయబద్ధంగా పూజాధికాలు నిర్వహించి గరుడ ప్రసాదాన్ని అందజేశారు. బలిహరణం, హోమ కార్యక్రమాలు ప్రముఖ యజ్ఞాచార్యులు సుధన్వాచార్యుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కొందరు యువతులు కాల, కుజ, రాహు, కేతు పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో తొలిసారి వాహనసేవ నిర్వహించగా సోమవారం గజ వాహనంపై స్వామివారు ఊరేగారు. మంగళవాయిద్యాలు, భక్తిగీతాలు, భజనలతో ఊరేగింపు కొనసాగింది. తిరుమల తరహాలో వాహన సేవలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రఘునాథాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, వికాస తరంగిణి సభ్యులు అంగడి నరేందర్, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



జిల్లా కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు,కేంద్ర బలగాలు

వనపర్తి: రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటును వినియోగించుకునేలా కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ చేయించామని డీఎస్పీ వెంకటేశ్వర రావు చెప్పారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు పాలిటెక్నిక్ కళాశాల నుంచి వివేకానందచౌరస్తా, టౌన్ పోలీస్ స్టేషన్, శంకర్ గంజ్, గాంధీచౌక్, గాంధీనగర్, మారెమ్మకుంట, అంబేద్కర్‌చౌక్, రాజీవ్‌చౌక్, బస్ డిపో మీదుగా టౌన్ హాల్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లాలోని అన్ని మండలాలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తామన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులను ఎర జూపటం, అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నిస్తే, వాటిని అరికట్టేందుకు చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి, కేంద్ర సాయుధ బలగాల అసిస్టెంట్ కమాండెంట్ రాముమండల్, సీఐ నాగభూషణం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టౌన్ ఎస్ఐలు జయన్న, రామరాజు, ఆర్ఎస్ఐలు వినోద్, సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూర్‌లో పోలీసుల కవాతు..

ఆత్మకూర్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఇండో టిబెటన్ బార్డర్ బెటాలియన్, స్థానిక పోలీసులు సోమవారం పట్టణంలో కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ మాట్లాడుతూ.. మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు నిర్వహించామన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లి పడమటితండా మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని సోమవారం మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం వనపర్తి పట్టణంలోని బీఆర్‌యస్ నాయకుడు గఫార్ తల్లి మృతి చెందడంతో నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంభ సభ్యులను పరామర్శించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అమరచింత: కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన వెంకటయ్య నాయక్ (50) గత నెల 26న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి మరో వ్యక్తి..



వెంకటయ్య యాదవ్ (ఫైల్)

కొత్తకోట రూరల్: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అమడబాకులకు చెందిన మొగులయ్య(36) ఈనెల 7న గ్రామ శివారులో గల పెట్రోల్ బంక్ వద్ద బైక్‌లో పెట్రోల్ వేసుకుని ఇంటికి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వనపర్తి ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లో తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాతతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నట్లు బంధువులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అవినీతిని ఆధారాలతో నిరూపిస్తాం

- బహిరంగ చర్చకు సిద్ధమా?
- మున్సిపల్ చైర్‌పర్సన్‌కు కౌన్సిలర్ల సవాల్



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

అమరచింత: మున్సిపాలిటీలో నాలుగేళ్ల నుంచి చేసిన అభివృద్ధి పనుల వెనుక అవినీతిని ఆధారాలతో నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇందుకు చైర్‌పర్సన్ సిదద్ధంగా ఉన్నారో లేదో చెప్పాలని కౌన్సిలర్లు సవాల్ చేశారు. మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చేసిన అవినీతిపై విలేఖరుల సమావేశం నిర్వహించి పలు విషయాలను వెల్లడించారు. నాలుగేళ్లలో ఏనాడు కౌన్సిల్ సమావేశంలో పెదవివిప్పి మాట్లాడలేని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ మున్సిపల్ అవినీతిపై చేసిన విమర్శలపై మొదటిసారి ప్రెస్‌మీట్‌లో మాట్లాడటం సంతోషమన్నారు. మున్సిపాలిటీలో ఇప్పటి వరకు రూ.18 కోట్లు మంజూరయ్యాయని, వీటితో మున్సిపల్ అభివృద్ధి అవుతుందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రకటించారని, ఈవిషయాన్ని చైర్‌పర్సన్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు మరిచిన తాము మరువమన్నారు. మున్సిపాలిటీకీ కేవలం రూ.10.50 కోట్లు మాత్రమే మంజూరయ్యాయని, వీటి ద్వారానే సుమారు రూ.9.50కోట్ల పైచిలుకు అభివృద్ధి చేశామని చైర్‌పర్సన్ చేసిన ప్రకటనపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలన్నారు. మున్సిపాలిటీకి రూ.18 కోట్ల నిధులు వచ్చాయని, వీటికి తమతో ఆధారాలు ఉన్నాయన్నారు. జనరల్ ఫండ్‌లో మున్సిపల్ అకౌంటెంట్ ఇచ్చిన లెక్కల ప్రకారం కేవలం రూ.20వేలు కూడా లేవని, చైర్‌పర్సన్ చూపిన లెక్కల ప్రకారం రూ.30 లక్షల నిల్వ ఎలా ఉందని ప్రశ్నించారు. ఆరు నెలలుగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఎందుకు వేధిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. కార్మికులు వేతనాల కోసం సమ్మె చేస్తుంటే నెల రోజుల వేతనం కోసం కొత్తగా విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన చెక్కు డ్రా కాకుండా ఎందుకు బౌన్స్ అయ్యిందో వివరించాలన్నారు.

టోల్‌ఫ్రీ నంబర్ పేరిట అక్రమం..

మున్సిపల్ టోల్‌ఫ్రీ నంబర్ అంటూ 14420 నంబర్ కోసం 2022లో రూ.22 వేలతో వీటిని మున్సిపల్‌లో అందుబాటులో ఉంచామంటూ ఇప్పటి వరకు వీటి నిర్వహణ కోసం రూ.96 వేలు ఖర్చు చేశారని లెక్కలు చూపిన చైర్‌పర్సన్, టోల్‌ఫ్రీ నంబర్ ఎక్కడుందో ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా రోడ్ డివైడర్ల నిర్మాణం కోసం రూ.36 లక్షలు వెచ్చించామంటూ, రూ.46 లక్షలు ఎందుకు డ్రా చేసుకున్నారన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ సొంతంగా మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులకు రూ.5వేల ఖర్చు చేస్తే వీటికి మున్సిపల్ నుంచి రూ.75వేలు ఖర్చు పేరిట వాడుకున్నారని తెలిపారు. హరితహారం మొక్కల కొనుగోలులో అవినీతి ఉందని వీటిని ఆధారాలతో నిరూపిస్తామన్నారు. అవినీతికి పాల్పడలేదన్న మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త నాగభూషణంగౌడ్ తెరవెనుక ఉంటూ అవినీతిని పెంచి పోషించారన్నారు. కౌన్సిలర్ల మధ్య గ్రూపు రాజకీయాలు చేయడం ద్వారా అధికార పార్టీలో నుంచి బయటకు వచ్చి అవినీతిపై పోరాడుతున్నామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు మంగలావణ్య, సింధు, విజయరాములు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గణపసముద్రం చెరువులో భూ సర్వే



ఖిల్లాఘనపురం గణప సముద్రం చెరువులో సర్వే చేస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువులోని భూములను ఇరిగేషన్ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. చెరువును రిజర్వాయర్‌గా మార్చుతుండటంతో మునిగే భూములు వివరాలను సేకరిస్తున్నట్లు భూసేకరణ డీటీ నాగరాజు, ఐబీ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటి విడతగా గెజిట్ వచ్చిన 388 ఎకరాలకు వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. సర్వే నంబర్ ప్రకారం రైతు వివరాలను గుర్తించడం, గుర్తించిన రైతు భూమిలో బోరుబావులు ఉన్నాయా? ఉంటే పనిచేస్తున్నాయా, బావులు ఉన్నాయా తదితర వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 168 ఎకరాల సర్వే పూర్తయ్యిందన్నారు. మున్ముందు ప్రభుత్వం చెల్లించే పరిహారం విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా భూమిలోని వివరాలను కూడా నమోదు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ మోయినోద్దీన్, రైతులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి



తిర్మలాయపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఖిల్లాఘనపురం: మండలంలో చేపడుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. సోమవారం మండలంలోని తిర్మలాయపల్లి, రోడ్డుమీదితండాలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో చాలా గ్రామాల్లో ప్రస్తుతం లెవలింగ్ పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పనులకు చాలా గ్రామాల్లో తక్కువ మంది కూలీలు వస్తున్నారని, కూలీల సంఖ్య పెరిగేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల విషయంలో కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. సకాలంలో మస్టర్‌ను ఆన్‌లైన్ చేయడం వలన కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు.

ఉపాధి పనుల పరిశీలన..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న ఫీడర్ చానల్ పనులను సోమవారం ఎంపీడీఓ రవీంద్ర పరిశీలించారు. మొక్కలకు రెండు పూటల నీరందించి కాపాడాలని సూచించారు. పనులలో కూలీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా చూడాలని ఎఫ్ఏలకు సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనుల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాలలో పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, ఏపీఓ ఘట్టయ్య పాల్గొన్నారు.



అమరచింత నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీఓ నర్సింహులు

నర్సరీల సంరక్షణపై దృష్టి

అమరచింత: మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని ఎంపీఓ నర్సింహులు తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో నర్సరీని సోమవారం పరిశీలించారు. ఎలాంటి మొక్కలు పెంచుతున్నామనే సమాచారంను తెలుసుకునే విధంగా పలకలపై రాసి ఉంచాలన్నారు. ఉదయం, సాయంత్రం మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందించాలన్నారు. వేసవి తాపంకు నర్సరీలోని మొక్కలు వాడుముఖం పట్టకుండా గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: భద్రాచలంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడాన్ని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం పట్టణంలోని చౌరస్తాలో సీఎం, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన హామీల్లో ఇప్పటికే నాలుగు పథకాల అమలుకు శ్రీకారం చుట్టడం జరిగిందని, రాష్ట్రంలోని పేదోడి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధికి మిత్రపక్షాలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మిషేక్, రాములు యాదవ్, సంద వెంకటేష్, రాములు, లక్ష్మయ్య యాదవ్, శ్యామ్, రవిందర్‌రెడ్డి, ముస్తఫా తదితరులు ఉన్నారు.


సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు



ఆత్మకూర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూర్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవినీతిని కప్పిపుచ్చేందుకు ఎస్‌బీఐ తాపత్రాయపడుతుందని సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖతారు చేస్తుందని సీపీఎం నాయకులు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎలక్ట్రోరల్ బాండ్లను బహిర్గతం చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని అన్నారు. ప్రధాని మోడీ ప్రభుత్వ రంగసంస్థలను అదాని, అంబానీలకు అప్పనంగా అప్పగిస్తున్నారని విమర్శించారు. ఎస్‌బీఐ చైర్మన్ మోడీకి వత్తాసు పలకడం రాజ్యాంగవిరుద్ధమని, బీజేపీని ఎన్నికల్లో పోటీ చేయకుండా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపి, రాజు, వెంకటేష్, అజయ్, విజయ్, భారతీయుడు, శివ, ఖాజ, మొగిలన్న తదితరులు ఉన్నారు.

సీపీఎం ధర్నా



జిల్లా కేంద్రంలో..

పెబ్బేరు రూరల్: సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించనందుకు సోమవారం సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు పుట్టా ఆంజనేయులు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ మాట్లాడుతూ.. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, నాలుగేళ్లలో విక్రయించిన, కొన్న బాండ్ల వివరాలను ఎన్నికల సంఘానికి మార్చి 6లోగా అందించాలని, ఎన్నికల కమిషన్ ఆ వివరాలను మార్చి 13లోగా బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. కానీ ఎస్‌బీఐ మోదీ అనుకూల వైఖరి ప్రదర్శిస్తోందని.. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండ్ల రాజు, రమేష్, బొబ్బిలి నిక్సన్, రాము, పరమేశ్వరాచారి, రాములు, శ్రీను, బాలస్వామి, రమేష్, గంధం గట్టయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నరేందర్‌కుమార్‌కు సన్మానం



డాక్టర్ నరేందర్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక అవార్డు అందుకున్న వనపర్తి జిల్లా మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ నరేందర్‌కుమార్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జిల్లా అఖిల పక్ష ఐక్యవేదిక నాయకులు సన్మానించారు. అధ్యక్షులు సతీష్‌యాదవ్ మాట్లాడుతూ.. దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా 2న హైదారాబాద్‌లో స్మారక అవార్డును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, దప్పు స్వామి, గంధం సుమన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.